ప్రజాశక్తి
మంగళవారం 29 అక్టోబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉప్పుగుండూరు మహిళలు

జనావాసాల మధ్య
మద్యం షాపు వద్దు..

కలెక్టరేట్ వద్ద ఉప్పుగుండూరు మహిళల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నాగులుప్పలపాడు మండలం, ఉప్పుగుండూరు గ్రామంలో జనావాసాల మధ్య పెట్టిన మద్యం షాపు తొలగించాలని పలువురు మహిళలు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఒంగోలు కలెక్టరేట్ వద్ద సోమవారం ఉప్పుగుండూరుకు చెందిన మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మిండాల అనంతలక్ష్మి, డి.రమాదేవి, పి.గాయత్రి మాట్లాడుతూ ఉప్పుగుండూరు గ్రామంలోని ఈదుమూడి బస్టాండ్ రహదారి కూడలి ప్రాంతంలో జనావాసాల మధ్య ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మద్యం షాపుల కేటాయింపులో పాలడుగు ఏడుకొండలు మద్యం షాపు నెంబర్ పికె 26 మంజూరైందన్నారు. ఆ షాపు పురుషోత్తమకాలనీ, ఎస్‌టి కాలనీ జనవాసాల మధ్య, బిఎస్ఎన్ఎల్ ఎక్ఛైంజ్ ఎదురుగా బెల్లం సీతారామయ్య నివాసంలో ఏర్పాటు చేశారన్నారు. దీంతో నిరంతరం ఈ ప్రాంత ప్రజలకు అసౌకర్యంగా ఉందని, మద్యం షాపు ప్రాంతంలోని ప్రధాన రహదారిపై నిత్యం జిల్లా పరిషత్ హైస్కూలుకి వెళ్లే విద్యార్థినులు, వాహనదారులు వెళుతుంటారన్నారు. మద్యం సేవించిన వారి ద్వారా నిత్యం సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. పరిసర ▶ 2లో

కనికరిస్తారా..వదిలేస్తారా..?

- పరిహారం కోసం నిర్వాసితుల ఎదురుచూపులు
- 'వెలిగొండ'పై ఆశలు పెట్టుకున్న రైతాంగం..
- నేడు తొలిసారి ప్రాజెక్టును సందర్శించనున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల



పూర్తయిన గొట్టిపడియ డ్యామ్

ప్రజాశక్తి-మార్కాపురం

'పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి. ఈ ప్రాజెక్టు వినియోగంలోకి వస్తే ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం కానుంది. వెలిగొండ జలాలు అందని పక్షంలో ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఏర్పడింది. గత వైసిపి ప్రభుత్వం వెలిగొండను ఏడాదిలో పూర్తి చేస్తామని చెప్పినా ఆచరణలో పూర్తి చేయలేదు. రెండు సొరంగాల నిర్మాణాలను మాత్రమే అరకొరగా పూర్తి చేయగలిగింది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు వెలిగొండపై పెద్దగా శ్రద్ధ చూపలేదు. సిఎం చంద్రబాబు 14 ఏళ్ల అధికారంలో ఉండి కూడా ప్రాజెక్టును పట్టించుకోలేదనే అపవాదు ఉంది. గత ఎన్నికల ముందుకు వెలిగొండ బాధ్యత తనదేనని నమ్మబలికారు. పశ్చిమ ప్రకాశంలో చంద్రబాబును ఇక్కడి ప్రజలు ఆదరించారు. ఇప్పుడైనా కనికరిస్తారా... 'వెలిగొండ'ను మళ్లీ గాలికి వదిలేస్తారా.? అని చర్చ జరుగుతోంది. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నాడు వెలిగొండ ప్రాజెక్టు పర్యటన సందర్భంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' నిర్మాణానికి ఆది నుంచీ అడ్డంకులు తొలగడం లేదు. నాలుగేళ్లలో పూర్తి చేస్తామన్న ప్రాజెక్టు నిర్మాణం మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇంకా నిర్మాణంలో ఉంది. రూ.3,500 కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు కాస్తా... నిర్మాణ పనుల్లో జాప్యంతో ప్రతిఏటా పెరుగుతున్న ధరలతో ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా పెరిగింది. ఇప్పటివరకు రూ.8 వేల కోట్లకు పైగా వెచ్చించడం జరిగింది. మరో రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తే గానీ వెలిగొండ పూర్తితో పాటు నిర్వాసితుల ప్యాకేజి సమస్య తీరనుంది.

వెలిగొండలో భాగమైన గొట్టిపడియ ఆనకట్ట, సుంకేసుల ఆనకట్ట, కాకర్ల ఆనకట్టలు పూర్తయ్యాయి. సొరంగ మార్గాల నుంచి నల్లమల సాగర్‌లోకి నీటిని సరఫరా కాలువ పనుల్లో కొంత భాగం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు నీటి లభ్యత 43 టిఎంసిలు కాగా జలాశయ సామర్థ్యాన్ని మాత్రం 53.850 టిఎంసిల నిల్వతో నిర్మిస్తున్నారు. వెలిగొండలోని 43.50 టిఎంసిల నీటిని మాత్రమే వినియోగించుకోవాలి. ప్రాజెక్టులో 10 టిఎంసిల నీటినిల్వ ఎప్పటికీ ఉంచాల్సిందే కానీ... వినియోగించరాదు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీటి అవసరాలు తీర్చాలనేది లక్ష్యం.

ఈ ప్రాజెక్టు కింద ముంపు గ్రామాలుగా మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువు తండా, పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కె.నాగులవరం, కలనూతల, చింతలముడిపి గ్రామాలను ▶ 2లో

అనుమతులు లేకుండా..
బాణాసంచా విక్రయిస్తే చర్యలు

- నిబంధనలు, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి
- ఎస్‌పి ఏఆర్ దామోదర్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలను అతిక్రమించి టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. జిల్లాలో బాణసంచా తయారీ లేదా విక్రయాలు లైసెన్సు కలిగిన వారు ప్రభుత్వ నియమనిబంధలనకు లోబడి ఉండాలని, బాణాసంచా, పేలుడు పదార్థాలు ఇంట్లో నిల్వ ఉంచరాదన్నారు. శాశ్వత, తాత్కాలిక బాణసంచా తయారీ లేదా విక్రయాల లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా అమ్మాలని, బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించుకోవాలన్నారు. షాపుల వద్ద మండే స్వభావం కలిగిన వస్తువులు ఉంచరాదని, నీరు, ఇసుక వంటి అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆ పరిసరాల్లో ఏమి చేయాలో ఏమి చేయకూడదో తగు సూచనలు చేస్తూ బోర్డులను ప్రదర్శనలో ఉంచాలని, చిన్న పిల్లలను బాణాసంచా దుకాణాల్లో విక్రయాలకు ఉంచుకోరాదన్నారు. లైసెన్స్‌లు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణ సంచా విక్రయాలు చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పండుగను జరుపు కోవాలన్నారు. బాణసంచా దుకాణాలకు దూరంలో వాహనాలను నిలుపుకునేలా చూసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు. జిల్లాలో అక్రమంగా తయారయ్యే టపాసులు, సరఫరా, విక్రయాలు చేసే వారిపై వారిపై నిఘా ఉంచాలని, టపాసుల స్టాల్స్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పాటించు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహించి దుకాణాల వద్ద భద్రత చర్యలను ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని, ముందస్తు జాగ్రత్తలు వల్లనే ప్రమాదాలను నివారించగలమని అధికారులకు ఎస్‌పి సూచించారు. దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్యరహిత టపాసులనే కాల్చాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని, సిల్క్ వస్త్రాలు ధరించవద్దని సూచించారు. ప్రజలకు, రోడ్డు వెంబడి వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా టపాసులు కాల్చాలని తెలియజేశారు. ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దల పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ సూచించారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100/112 లకు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని ఉంటే పోలీసులకు తెలియచేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి తెలియజేశారు.





విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

విద్యార్థులతో కలెక్టర్ తమీమ్‌అన్సారియా

5లో ▲

ఎమ్మెల్యే దామచర్లను కలిసిన డిఆర్ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా రెవెన్యూ అధికారిగా బి.చినఓబులేసు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఇద్దరూ పలు విషయాలను చర్చించుకున్నారు. డిఆర్ఒగా బాధ్యతలు స్వీకరించిన బి.చినఓబులేసుకు ఎమ్మెల్యే దామచర్ల శుభాకాంక్షలు తెలిపారు.



దామచర్లతో డిఆర్ఒ

'మీకోసం' అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి: కలెక్టర్

కనికరిస్తారా..వదిలేస్తారా..?

(మొదటిపేజీ తరువాయి)

ముందుగానే ముంపు కింద గుర్తించారు. ఆ తరవాత గుండంచెర్ల, కాటంరాజు తండాలను గుర్తించారు. అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, రామలింగేశ్వరపురం, సాయిరాంనగర్‌లు మునకలో పోనున్నాయి. మొత్తం 7 వేల మంది వరకు నిర్వాసితులు ఉన్నారు. వారందరికీ ప్యాకేజి పెద్ద సమస్యగా మారింది. ఒక్కో కుటుంబానికి రూ.12.50 లక్షల ప్యాకేజీతో వన్‌టైం సెటిల్‌మెంట్‌గా నిర్వాసితులు అంగీకరించారు. ప్యాకేజీ ఇవ్వడంలో పాలకులు తాత్సారం చేయడంతో నేటికీ అరకొర వసతుల మధ్య నిర్వాసితులు ముంపు గ్రామాల్లో జీవనం సాగించాల్సి వచ్చింది. ఇప్పటికైనా తమను ముంపు గ్రామాల నుంచి బయటకు తీసుకురావాలని, మెరుగైన ప్యాకేజీతో ఆదుకుంటారని నిర్వాసితులు ఆశతో ఎదురుచూస్తున్నారు. సిఎం చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చేలా.. ఇక్కడి ప్రజల కరువు కష్టాలు తీర్చేలా మంత్రి నిమ్మల రామానాయుడు ప్రభుత్వానికి నివేదించాలని ఇక్కడి ప్రజలు వేడుకుంటున్నారు.

జనావాసాల మధ్య మద్యం షాపు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతంలో జనావాసాలు ఉండటంతో ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో రహదారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఈ మద్యం షాపును గ్రామ శివారులో ఏర్పాటుచేసేలా చూడాలని కోరారు. అనంతరం మీకోసం కార్యక్రమంలో ఉప్పుగుండూరు గ్రామస్తులు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కలసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మద్యం షాపును జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మిండాల ఏడుకొండలు, వై.వెంకట వెంకటశేషమ్మ, శేషగిరిరావు, విజయలక్ష్మి, అంజలి, కె.రవణమ్మ, జి.రాంబాబు, సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ఎస్ఐ వేజెండ్ల అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ముమ్మరంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీలు చేశారు. లైసెన్స్ లేని వాహనాలకు పెనాల్టీలు విధించారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అజయ్‌బాబు హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

బాణసంచా విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వేజెండ్ల అజయ్ బాబు అన్నారు. మండలంలో అక్రమంగా టపాసులు తయారీ, సరఫరా, విక్రయ దారులు అనుమతులు లేకుండా నిబంధనలు అతిక్రమించి బాణ సంచా విక్రయిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విక్రయాల లైసెన్సు కలిగినవారు ప్రభుత్వ నియమ నిబంధలనకు లోబడి ఉండాలని, బాణసంచా, పేలుడు పదార్థాలు ఇంట్లో నిల్వ ఉంచరాదని, శాశ్వత, తాత్కాలిక బాణాసంచా తయారీ లేదా విక్రయాల లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే బాణాసంచా అమ్మకాలు జరగాలని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించుకోవాలన్నారు.

దీపావళి పర్వదినాన్ని ప్రజలు అందరూ ఆనందంగా జరుపుకోవాలని, సాధ్యమైనంతవరకు కాలుష్యరహిత టపాసులనే కాల్చాలని, టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని, సిల్క్ వస్త్రాలు ధరించవద్దని అన్నారు. దీపావళి రోజున ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100, 112, లేదా పోలీస్ వాట్స్అప్ నెంబర్ 9121102266 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, బాధ్యతతో వ్యవహరించి శాశ్వత పరిష్కారానికి కషి చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్ నుంచి ఆమె సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార పురోగతి, వివిధ శాఖలకు సంబంధించిన కోర్టు కేసులు, ఉపాధి హామీ చట్టం నిధులతో చేపట్టిన పనుల పురోగతి, జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై క్షేత్రస్థాయిలో ఎంపిడిఓలు, తహాశీల్దార్లు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఏపిడి, ఎపిఒ ఈఈ, డిఇలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పాల్గొన్న అధికారులు

మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వేగవంతంగా నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. పరిష్కరించలేని సమస్యలను అర్జీలకు రాతపూర్వకంగా ఎండార్స్‌మెంట్ రూపంలో తెలియజేయాలన్నారు. రీ ఓపెన్ కేసులపై రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్, డివిజనల్ అధికారుల ను ఆదేశించారు. వీడియో కాన్ఫెరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ లోకేశ్వర రావు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ డాక్టర్ సురేష్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, జిల్లా ఉపాధి కల్పన అధికారి టి.భరద్వాజ్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజల పాల్గొనగా, రెవిన్యూ డివిజనల్ అధికారులు, ఎంపిడిఒలు, తహాశీల్దార్లు, సంబంధింత శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో అర్జీల పరిష్కారం: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చట్టపరిధిలో విచారించి అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఫిర్యాదీదారులకు భరోసా కల్పించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వారి కష్టాలను, బాధలను, వివిధ సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలను విని, వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగ పరిష్కరించి, బాధితులకు న్యాయం చెయ్యాలని ఆదేశించారు. అర్జీలను చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో 44 మంది ఫిర్యాదుదారులు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ ఇంచార్జ్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి



పొదిలి-మర్రిపూడి రహదారిని పరిశీలిస్తున్న ఏఈ లక్ష్మీదీప్తి

మర్రిపూడి కోనేరుతో ప్రమాదాలు లేకుండా చూస్తాం

ప్రజాశక్తి-మర్రిపూడి

మండల కేంద్రమైన మర్రిపూడి నుంచి పొదిలికి వచ్చే రహదారి మార్గంలో బస్టాండ్ సెంటర్‌కు కూత వేటు దూరంలో ఉన్న పాత కాలం నాటి కోనేరుతో ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉందన్న సమాచారంతో కొండపి ఆర్అండ్‌బి ఏఈ లక్ష్మీ దీప్తి స్పందించారు. సోమవారం కోనేరును, రహదారిని స్వయంగా పరిశీలించారు. ప్రైవేటు టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ రహదారి వెంట తీస్తున్న కందకంతో గుంటలు పడినట్లు తెలిపారు. ఈ కారణంగా కోనేరు వద్ద ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని స్వయంగా ఏఈ అంగీకరించారు. వెంటనే ఎయిర్టెల్ కంపెనీ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. మర్రిపూడి-పొదిలి మార్గంలో ఎక్కడైతే రహదారి దెబ్బతిందో అక్కడ రిపేరు పనులు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఒప్పించినట్లు తెలిపారు. అందుకోసం జెసిబితో పనులు చేయిస్తున్నట్లు ఆమె తెలిపారు. రహదారి మార్జిన్‌లో గుంటల దగ్గర మట్టిని రోలర్ తొక్కించి సమస్య పరిష్కారానికి కృషి చేస్నున్నట్లు ఆమె తెలిపారు.

విధుల నుంచి తొలగించవద్దు..

పాలకవీడు పాఠశాల పారిశుధ్య కార్మికురాలి ఆవేదన

ప్రజాశక్తి- రాచర్ల



దమ్ము భారతి

నేను ఏ తప్పు చేయలేదు.. నన్ను ఉద్యోగం నుంచి తొలగించవద్దు.. అంటూ రాచర్ల మండలం పాలకవీడు ప్రాథమిక పాఠశాల పారిశుధ్య కార్మికురాలు దమ్ము భారతి అధికారులను వేడుకుంటున్నారు. తాను గత 14 సంవత్సరాలుగా ఆ పాఠశాలలో పనిచేస్తున్నాని, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ఈ ఉద్యోగమే నా కుటుంబానికి ఆధారమని మొరపెట్టుకుంటోంది. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, ఏ కారణం లేకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణా రెడ్డి నెల నుంచి విధులకు రావద్దని చెప్పినట్లు ఆమె గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధుల వద్ద వాపోయింది. పాఠశాల పారిశుధ్య కార్మికురాలి ఉద్యోగంపై ఆధారపడి తన కుటుంబం బ్రతుకుతున్నట్లు, ఉద్యోగం కోల్పోతే తన కుటుంబం బజారున పడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. అకారణంగా భారతిని ఉద్యోగం నుంచి తొలగించటం అన్యాయమని పలువురు గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



డివైడర్‌ను ఢీకొన్న కారు

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఐదుగురికి గాయాలు, పాప పరిస్థితి విషయం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

దోర్నాల - శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వీరంతా దైవ దర్శనానికి శ్రీశైలం వెళుతుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు అందరూ కాకినాడకు చెందిన వారిగా గుర్తించారు.

ఫాగింగ్ లేక.. దోమల బెడద

వీధుల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు

ప్రజాశక్తి - గిద్దలూరు

నగర పంచాయతీ అధికారులు పట్టణంలో ఫాగింగ్ చేయించకపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. ఇటీవల కురిసిన వర్షాలకు గిద్దలూరు పట్టణంలో ఎక్కడిక్కడ ఖాళీస్థలాలో వర్షపు నీరు నిలిచి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. దీంతో దోమల ఉధృతి పట్టణంలో విపరీతంగా పెరిగింది. వృద్ధులు, చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలు కిటకిటలాడుతున్నాయి. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పట్టణంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిద్దలూరు నగరపంచాయతీ పరిధిలో 20 వార్డులకు గాను



రాంభూపాల్ రెడ్డి కాలనీలో మురుగు నీరు



వెంకటేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

10 వార్డు సచివాలయాలు కూడా ఉన్నాయి. 10 వార్డు సచివాలయాలకు కూడా 10 మంది శానిటేషన్ సెక్రటరీలు ఉన్నప్పటికీ పట్టణంలో పారిశ్యుధ్య పనులు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. పట్టణంలో రోజు ఉదయం మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు పలు ప్రాంతాలలో పర్యటించి పారిశ్యుధ్య పనులు పర్యవేక్షించినప్పటికీ ఎటువంటి ఫలితం కూడా లేకుండా పోయిందని పలువురు పట్టణ వాసులు మండిపడుతున్నారు. ఇంకా పలు వీధులలోని ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు ఉండటంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా ఉన్నాయి. ఇప్పటికైనా ఇళ్ల మధ్యన ఖాళీస్థలాలోని నీరు తొలగించి, పట్టణంలోని వీధులలో ఫాగింగ్ చేయించి దోమల బెడద తగ్గించి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మహిళా సమాఖ్యలో నిధులు గోల్‌మాల్..?

- లక్షల్లో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు - గ్రూపు సభ్యుల్లో ఆందోళన

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండల మహిళా సమాఖ్యలో లక్షల్లో నిధులు గోల్‌మాల్ జరిగినట్లు మండల డ్వాక్రా పొదుపు గ్రూపు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల్లో కొంతమంది వీవోఏలు, ఒక సీసీ కుమ్మక్కై స్త్రీనిధి నిధులు బొక్కేశారని, వీరు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయని పొదుపు సంఘాల సభ్యులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కొందరు వీఏవోలు క్లోజ్ అయిన గ్రూపుల డబ్బులను గ్రూపు లీడర్లకు, సభ్యులకు తెలియకుండా డబ్బులు డ్రా చేసి పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రూపుల వారీగా స్త్రీనిధి నిధులు, రుణాలు రికవరీ నగదు, స్త్రీనిధి కింద ఇచ్చిన డబ్బులకు వచ్చిన వడ్డీ, ఆ వడ్డీ డబ్బులు వివరాలన్నింటినీ బ్యాంక్ స్టేట్‌మెంట్లతో సహా అందజేయాలని, ఆడిట్ కాపీలు, రుణాలు తీసుకొన్న గ్రూపుల వివరాలు సమాచార



రాచర్లలోని మహిళా సమాఖ్య కేంద్రం

హక్కుచట్ట ప్రకారం అన్ని గ్రూపు సభ్యులకు సమాచారం అందజేయాలని, జరిగిన కుంభకోణంపై జిల్లాస్థాయి అధికారులు విచారణ చేపట్టాలని పొదుపు సంఘాల మహిళలు కోరుతున్నారు.

ఈతకొడుతూ.. అస్వస్థతకు గురై..

యువకుడు మృతి

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్



మృతి చెందిన ఆనంద్

స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు ఈత కొడుతూనే అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన ఐదు మంది యువకులు సోమవారం గ్రామం సమీపంలోని వాగులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతూ గడ్డం ఆనంద్ (20) అనే యువకుడు అస్వస్థకు గురయ్యాడు. కెఎస్‌పల్లె ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. గిద్దలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగులుప్పలపాడు మండలంలోని మట్టిగుంట సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన పి.ప్రభాకరరావు (45) ద్విచక్ర వాహనంపై పనిమీద ఉప్పుగుండూరు గ్రామానికి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి తన స్వగ్రామానికి వెళ్లే క్రమంలో మట్టిగుంట సమీపంలో గుర్తు తెలియని ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎఎస్ఐ సుబ్బారావు సంఘటనా స్థలానికి వెళ్ళి ప్రమాద వివరాలు సేకరించారు. మృతుడు జేబులో ఉన్న ఆధారాల ప్రకారం తిమ్మసముద్రంకు చెందిన ప్రభాకరరావుగా గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెక్కు బౌన్సు కేసులో కోర్టు ఉద్యోగికి శిక్ష

ప్రజాశక్తి-కనిగిరి

చీరాల కోర్టు అమీనాగా పనిచేస్తున్న పాలపర్తి ప్రభాకర్‌రావు అనే వ్యక్తి దర్శికి చెందిన దమాముల చిన్న వీరయ్య అనే వ్యక్తి నుంచి రూ.2 లక్షలు అప్పు తీసుకొని దాని తాలూకు రెండు లక్షలకు చెక్కు ఇచ్చాడు. సదరు చిన్న వీరయ్య ఆ చెక్కులను బ్యాంకులో వేయగా అవి బౌన్స్ అయ్యాయి. దాని తాలూకు కేసు ఒక సంవత్సరం విచారణ జరిగి నేరం రుజువైనందున సోమవారం కనిగిరి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర నిందితునికి శిక్ష విధించారు. సోమవారం కోర్టుకు హాజరుకానందున కనిగిరి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర దోషిని ఎక్కడ ఉన్నా తక్షణమే నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారంట్ జారీ చేసి అరెస్టు చేయాలని పోలీస్ వారికి ఆదేశాలు ఇచ్చారు. దోషిని కోర్టులో హాజరుపరచిన తర్వాత శిక్షకాలం ఎంత అనేది తెలియజేస్తామని వెల్లడించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గొలుసు దుకాణంపై దాడి

152 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని మునగపాడు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న గొలుసు దుకాణంపై దాడి చేసి 152 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఎక్సైజ్ సీఐ అరుణకుమారి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నూతన మద్యం దుకాణాలు ప్రారంభమైన తర్వాత మండలంలో రెండవసారి దాడి నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిఐటియు నాయకులు పూసపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ స్థానిక సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. సందర్భంగా పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, డెత్, సిక్ పోస్టులలో వారి బిడ్డలకు ఉద్యోగాల కల్పన, సాధారణ ప్రమాదాలకు ఎక్స్‌గ్రేషియా లాంటి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలతో పాటు, సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఏడుకొండలు, పి.పద్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులందరికీ పని కల్పించాలి

ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఏపీడీ వెంకట స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి హామీలో భాగంగా పని కల్పించాలని ఏపీడీ వెంకటస్వామి అన్నారు. శింగరాయకొండ మండల కార్యాలయంలో సోమవారం శింగరాయకొండ మండలం, జరుగుమల్లి మండలాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లకి ప్రాజెక్టు డైరెక్ట్ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ముఖ్యంగా పనులు గుర్తించేటప్పుడు నీటి సంరక్షణ పనులు గుర్తుంచాలని, రైతులకు, రైతు వారి కుంటలు ఎక్కువగా చేయించాలన్నారు. ఎంపీడీఓ జయమని మాట్లాడుతూ నీటి సంరక్షణ పనులు, ప్రభుత్వం కార్యాలయాలకు అన్నింటికీ రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ వెంకట స్వామి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నరేంద్ర వర్మ

కమ్యూనిటీ హాలు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

శాంతి, సమానత్వాన్ని కోరే ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని సిబిజెడ్ చర్చ్ ఆవరణలో బాప్టిస్టు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సోమవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం జిల్లా అధ్య క్షులు సలగల రాజశేఖర్ బాబు, గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వేమవరపు విజయ్ కుమార్, ఎన్ పుష్పరాజు, ఎస్ బాలస్వామి, ఎం పవిత్ర కుమార్, టి ప్రేమ్ చంద్, జెఎస్ హెర్బర్ట్, ఆర్ ప్రసన్న కుమార్, ఎం రాహుల్ దేవ్, రేవ కెజె సుభాకర్, చిన్న నాగయ్య, దేవా, డి సుకన్యాదేవి, కమల లత, సిహెచ్ జాస్మిన్, రత్న, డేనియల్ పాల్గొన్నారు.



వర్క్‌షాపును పరిశీలిస్తున్న అధ్యాపకులు

పిసిబి డిజైన్‌పై వర్క్ షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ డిజైన్‌పై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 16 నుండి 29 వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వర్క్ షాప్‌ను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ దేవతోటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్క్యూట్ డిజైన్‌పై ప్రయోగాత్మకంగా వివరించడం వల్ల విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ వర్క్ షాపుకు ఉమామహేశ్వరరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించగా ప్రొఫెసర్లు ఎన్‌వి రాఘవస్వామి, ఎస్ రవీంద్ర, బి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

జిఎస్‌టి ఎత్తివేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

మచిలీపట్నం ఎల్ఐసి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లకు కమిషన్ పెంచాలని, ఎల్ఐసి ప్రీమియంపై జిఎస్‌టి ఎత్తివేయాలని, పాలసీదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరుతూ స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ఏజెంట్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఏజెంట్లు నినాదాలు చేశారు. పూర్తి రెస్ట్ డేగా పాటించి ఏజెంట్లు అందరూ నిరసన తెలిపినట్లు ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు బసవరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎం రాంబాబు, టిడిఎల్ ప్రసాద్, చిరంజీవి జగన్నాధరావు, పద్మావతి, ఉపేంద్ర, పివి సుబ్రహ్మణ్యం, గరికపాటి వెంకటేశ్వరరావు, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై కిషోర్ బాబు పాల్గొన్నారు.

గవినివారిపాలెం కాలువకు నీరందించాలి

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో పెండింగులో ఉన్న కొరిశపాడు, భవనాసి రిజర్వాయర్లు, గుంటూరు చానల్ పొడిగింపు తోపాటు గవినివారిపాలెం కాలువకు నీరు అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లపనేని రామారావు డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో బిఎల్‌కె ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఎపి రైతు సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ నిధులతో పంట కాలువలు మరమ్మత్తులు చేయించాలని కోరారు. ఎస్టేట్ భూముల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోగస్ కార్డులు రద్దు చేయాలని అన్నారు. ఎరువులు, పురుగు మందులు



సమావేశంలో రైతు సంఘం నాయకులు

ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు బండి శంకరయ్య, కందిమళ్ళ రామ కోటేశ్వరరావు, కృష్ణమూర్తి, కాకర్ల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు



అర్జీ ఇస్తున్న సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వారాంతరపు సెలవులు, పనిభారానికి అనుగుణంగా కొత్త కార్మికులను నియమించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం స్కిల్, సెమీ స్కిల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం అతి తక్కువ వేతనం ఇస్తుందని అన్నారు. గత డిసెంబర్లో జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి కె హరిబాబు, రత్నం, నాగరాజు, పి రాము, ప్రమీల పాల్గొన్నారు.

చీరాల : మునిసిపల్ పారిశుధ్య కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారించాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారించాలని కోరుతూ కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. పట్టణ విస్తీర్ణం మేరకు కార్మికులు సంఖ్య పెంచాలని అన్నారు. మృతులకు ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షలు నుండి రూ.7లక్షలకు పెంచాలని కోరారు. దహన సంస్కారాలకు రూ.15వెల నుండి రూ.20వేలకు పెంచాలని కోరారు. కార్మికులకు చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు అందజేయాలని అన్నారు. 17రోజుల సమ్మె కాలంలో జీతాలు, పండుగ కానుక రూ.వెయ్యి చెల్లించాలని అన్నారు. ఆప్కాబ్ ద్వారా రిటైర్మెంట్ చేసిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నూతలపాటి రాజు, బడుగు కుమారి, పాపమ్మ, తిరుపతమ్మ, స్వరూప, ఎసమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓట్ల నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు ఓట్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో ప్రజా సఘాల ఆధ్వర్యంలో ఓట్ల నమోదుపై అవగాహన కల్పిస్తూ వివిధ ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో పట్టభద్రులైన ఓటర్లకు ఓటు హక్కు కల్పించుకునే విధానంపై అవగాహన కల్పించారు. 2021కు ముందు డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ విద్యార్హత ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఓటు గుర్తింపు కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్టు ఫోటో అందజేస్తే పూర్తిచేసి సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలిపారు. తహశీల్దారు కార్యాలయంలో తగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ



క్యాంపియన్ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పత్రాల జిరాక్సులపై గెజిటెడ అటెస్టేషన్ చేయాల్సి ఉండదని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, సురేష్ కుమార్, సిఐటియు నాయకులు ఎం సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి మనోజ్ పాల్గొన్నారు.

యడ్లపల్లిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వేమూరు

చుండరు మండలం ఎడ్లపల్లిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సోమవారం ప్రారంభించారు. అండర్ 17 విభాగంలో 68వ రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. విద్యార్థులతో కలిసి చెస్ ఆడి విద్యార్థులను ఆయన అబ్బురపర్చారు. వెల్లటూరులో దేవాదాయ శాఖ పరిధిలోని లోకల్ ఫండ్ చౌల్ట్రీ భవన పున నిర్మాణ, అభివృద్ధి పనులకు లోకల్ ఫండ్ చౌల్ట్రీ కార్యనిర్వాహణ అధికారి దివి వెంకటఅప్పలాచార్యులు పర్యవేక్షణలో శంకుస్థాపన చేశారు. రూ.7లక్షల లోకల్ పండు సేకరించగా మిగిలిన రూ.63లక్షలు ప్రభుత్వ నిధి మంజూరు చేసినట్లు తెలిపారు. తహశీల్దారు ఎం శ్రీనివాసరావు,



విద్యార్థులతో చెస్ ఆడుతున్న ఆనందబాబు

ఎంపిడిఒ ఎస్‌వి రమణ, సర్పంచి బొజ్జ రవి, వాకా శేషుబాబు, వెల్లటూరు ఎంపిటిసి వాక శివనారాయణ, మోటూరు పుణ్య శ్రీనివాస్రావు, కాంట్రాక్టర్ మట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని ఆవులవారిపాలెం పంచాయతీలోని మాల్లంక కాలనీవాసులకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ నరసింహారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ కృష్ణ నదికి ఇటీవల వచ్చిన వరదల కారణంగా లంక గ్రామాల ప్రజలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాల్లంక గ్రామ ప్రజలు ఎక్కువ శాతం ఇటుక బట్టీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారని, వరదల కారణంగా ఇటుక బట్టీల గుంతల్లో నీరు చేరడంతో పనులు దొరకడం లేదని తెలిపారు. ప్రభుత్వం మాత్రం పల్లె పండుగని చెబుతూ సిమెంట్ రోడ్లు వేసేందుకు మొగ్గు చూపుతున్నప్పటికీ ప్రజలకు పనులు చూపించడం లేదని అన్నారు. గ్రామంలో 250 కుటుంబాలు ఉన్నాయని, వలసలు నివారించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే అమలు చేసి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని కోరారు. రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టర్ జెవి మురళికి మొక్క అందిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్

ఆర్డీవోగా చంద్రశేఖర్ నాయుడు

ప్రజాశక్తి - చీరాల

నూతన ఆర్డీఒగా తూమాటి చంద్రశేఖర్ నాయుడు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆర్డీఓగా విధులు నిర్వహించిన అఖిల రామచంద్రపురం బదిలీ కావడంతో ఆమె స్థానంలో చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె వెంకట మురళిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మెక్క అందజేశారు. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాంబాబు

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపూరుపాలెం స్ట్రైట్ కట్ట కాలువ వద్ద నివసిస్తున్న పేద విద్యార్థులకు డాక్టర్ బాబు జగజ్జీవనరావు చైర్ పరిశోధకులు తేళ్ళ రాంబాబు ఆధ్వర్యంలో వైసిపి ఇన్చార్జ్ కరణం వెంకటేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ శాసన సభ్యులు కరణం బాలరామకృష్ణమూర్తి అడుగుజాడల్లో నడుస్తున్న ఆయన తనయుడు కరణం వెంకటేష్ బాబు పేదల పక్షంగా ఉంటారని అన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు సహాయ, సహకారం అందిస్తూ అండగా ఉండే వ్యక్తి అన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

- విద్యార్థి దశలోనే అన్ని విధాలా మనోవికాసం సాధించాలి
- కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు శాస్త్రీయ ధక్పథాన్ని అలవరచుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా పిలుపునిచ్చారు. సోమవారం నాడు కొండపిలోని డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తున్న జోన్ స్థాయి సైన్స్ ఫెయిర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. 'ఫ్యూచర్ ఆన్ 2024-25' పేరుతో రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంగీత వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి, వేదికపై ఉన్న ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్‌లో పెట్టిన వివిధ ప్రాజెక్టులను ఆమె ఈ సందర్భంగా ఆసక్తిగా తిలకించారు.

కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్స్ వల్ల విద్యార్థులలో తమ ప్రతిభను చాటుకోవాలనే పోరాట స్ఫూర్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులందరూ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తద్వారా శాస్త్రీయ దక్పథం పెరగడంతో పాటు భయం తొలగి వ్యక్తిత్వ వికాసం కూడా వస్తుందన్నారు. విద్యార్థి దశలోనే అన్ని విధాలా మనోవికాసం సాధించాలని వారిలో స్ఫూర్తి నింపారు. ఉన్నత విద్యాభ్యాసం ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం కూడా లభిస్తుందన్నారు. విద్యార్థులందరూ ముఖ్యంగా బాలికలు 18 సంవత్సరాలు నిండే వరకూ పెళ్లి చేసుకోకుండా చదువుకోవాలని చెప్పారు. ఈ దిశగానే 'బంగారు బాల్యం' పేరుతో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాలు కూడా రూపొందించిందన్నారు. టీచర్లు కూడా విద్యార్థులను తమ సొంత బిడ్డలుగానే భావించి ఆయా అంశాలపై వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ.పి.ఎస్.డబ్ల్యూ.ఆర్. ఈ.ఐ.ఎస్. జిల్లా కో-ఆర్డినేటర్ డి. జయ మాట్లాడుతూ ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏ.పి.ఎస్.డబ్ల్యూ.ఆర్. ఈ.ఐ.ఎస్. గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ కె.పద్మజ, నెల్లూరు జిల్లా కో-ఆర్డినేటర్ కె. జయలక్ష్మి, ఎంపిడిఓ రామాంజనేయులు, తహశీల్దార్ మురళి, ఎంఇఒ-1 సురేఖ, ఎంఇఒ-2 రామారావు, ప్రిన్సిపాల్ అరుణ. ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించిన సత్య

విద్యార్థులు భవిష్యత్తులో సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన మూడు జిల్లాల సైన్స్‌ఫెయిర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సభలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కళాశాలలో కావలసిన మౌలిక వసతుల కల్పనకు దామచర్ల కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ముందుగా పాఠశాల విద్యార్థులు దామచర్ల సత్యకు ఘన స్వాగతం పలికారు. కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి సత్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, వసంత రాయుడు, నారాయణస్వామి, నరసారెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్, సిఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న దామచర్ల సత్య


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాలలో పనిచేస్తున్న కార్మికుల స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఒంగోలు నగర కమిటీ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి యూనియన్ నగర కార్యదర్శి టి.విజయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు టి మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు అయినా కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు రెగ్యులర్ గా ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. కనీసం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకి రెగ్యులర్ గా వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు కే సామ్రాజ్యం, యూనియన్ నాయకులు కే వంశీ, బాబు, బి దివ్య, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

మంత్రుల పర్యటనను జయప్రదం చేయండి

టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు మంగళవారం సందర్శిస్తారని, మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొంటారని, వీరి పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన పెద్దదోర్నాలలోని టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రుల పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జునరెడ్డి, షేక్ మాబు, బట్టు సుధాకరెడ్డి పాల్గొన్నారు.


ప్రోత్సాహక పత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ నాగరాజు

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

అన్ని దానాల్లోకల్లా రక్తదానం మహత్తర పుణ్యకార్యమని, రక్తదానం ప్రాణదానంతో సమానం అని డీఎస్పీ యు నాగరాజు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం యర్రగొండపాలెంలోని ముస్లిం యూత్ సొసైటీ, బీసీ సంఘంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై చౌడయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యాదిద్య, ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, బీసీ సంఘం నాయకులు బట్ట పోతుల వెంకటేశ్వర్లు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పోట్ల గోవిందు, తెలుగు యువత నాయకులు షేక్ వలీ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు ఫొటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 6 నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు 30 రోజులు ఒంగోలులో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9573363141 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'వెలిగొండ' పూర్తికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి

సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తికి ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఈ బడ్జెట్ సమావేశాలలో రూ.2 వేల కోట్లు నిధులు మంజూరు చేయాలని, ప్రాజెక్టు నిఖర జలాలు కేటాయించాలని సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ కష్ణ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య, మన్నే సాంబశివరావు, ఎన్.యోగయ్య, మొగిలి చిన్నవెంకటేశ్వర్లు, ఎన్ బ్రహ్మయ్య, డి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు సోమవారం గ్లాసరీ సాఫ్టెక్, హైదరాబాద్ సంస్థ కో ఆర్డినేటర్ వైవి రాఘవరెడ్డి మరియు ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, యర్రగొండపాలెం కామర్స్ అధ్యాపకురాలు రహమత్ ఉన్నిసా బేగం సంయుక్తంగా కళాశాల కోసం రూ.5 వేల విలువైన క్రీడా పరికరాలు అందించారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీధర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి ప్రదీప్‌తో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లావ్యాప్తంగా డిగ్రీ,పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన,ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ యర్రగొండ పాలెం మండల కార్యదర్శి షేక్ హిదాయతుల్లా డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి.. తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేపట్టారు. డిటి నాలగాటి మల్లికార్జున నాయుడును ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను విద్యార్థుల తల్లిదండ్రులు ఖాతాలో వేస్తారా లేక కాలేజి యాజమాన్యల ఖాతాలో వేస్తారా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమ్మకు వందనం పథకం కింద ప్రతి విద్యార్థికీ 15 వేలు వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



యర్రగొండపాలెంలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

మార్కాపురం: ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మార్కాపురం పట్టణ కార్యదర్శి శివ సాయికుమార్ మాట్లాడారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, చరణ్, దేవదాస్, జాన్సన్, సాయి, గంగాంజి, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు దగ్గుపాటి సోమయ్య పాల్గొన్నారు.


మార్కాపురంలో సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఒంగోలులో 46 బాణాసంచా దుకాణాలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

దీపావళి పండుగ సందర్భంగా ఒంగోలు నగరంలో 46 బాణాసంచా దుకాణాలను నగరంలోని పివిఆర్ బాలుర పాఠశాల మైదాన ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాల ఏర్పాటుకు సంబంధించి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం మార్కింగ్ ఇచ్చారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకర్, సర్వేయర్ ఆవుల శ్రీను, స్టాల్స్ కాంట్రాక్టర్లు నుసుం అంకిరెడ్డి, ఎం భాస్కర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.


మార్కింగ్ ఇస్తున్న అధికారులు



రక్తదానం చేసిన వ్యక్తిని అభినందిస్తున్న నాయకులు

రోటరీ ఆధ్వర్యంలో రక్త దానం

ప్రజాశక్తి - అద్దంకి

డెంగ్యూ జ్వరం వలన ప్లేట్ లెట్స్ పడిపోయి రక్తం అత్యవసరంగా ఎక్కించవలసిన గోపాలపురం నివాసి నూతలపాటి హరిబాబుకు రోటరీ క్లబ్ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకి చెందిన గుమ్మడి సుబ్బారావు చేత రక్త దానం చేయించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రక్త దానాన్ని ప్రోత్సహించిన చుండూరి మురళీ సుధాకరరావును, రక్త దాతను రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న తోకల కృష్ణమోహన్

నోటు పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని జాగర్లమూడి ఎఎస్ ఉన్నత పాఠశాల్లోని 90మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు సోమవారం బహుకరించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పుస్తకాల దాత రోటరీ సభ్యుడు నాగబడు సుబ్బారావు మాట్లాడుతూ బాగా చదివే విద్యార్థులకు చేయూత ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, దూళిపల్లి సత్యనారాయణ, పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రం, రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు రోటరీ సేవల్ని కొనియాడుతూ పుస్తకాల దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

బైకు అదుపు తప్పి డివైడర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని అమరావతి స్పిన్నింగ్ మిల్లు వద్ద సోమవారం వేకువ జామున చోటు చేసుకుంది. నెల్లూరు పట్టణంలోని కాపు వీధికి చెందిన పగడాల కుమార్ (45) తెనాలి పట్టణంలో బట్టల దుకాణం నిర్వహిస్తూ ఆదివారం సెలవు కావడంతో తన సొంత ఊరు నెల్లూరుకి ద్విచక్ర వాహనంపై వెళుతూ మార్టూరు సమీపంలోని అమరావతి స్పిన్నింగ్ మిల్లు వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్ ఢీ కొట్టినట్లు హైవే మొబైల్ సిబ్బంది నాయక్ తెలిపారు. ఈ ప్రమాదంలో కుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మార్టూరు అర్బన్ సీఐ మాదినేని శేషగిరిరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్తంభాన్ని ఢీ కొట్టిన బైకు

ప్రజాశక్తి - అద్దంకి

మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాల పాలైన ఘటన సోమవారం జరిగింది. మండలంలోని చిన్న కొత్తపల్లి గ్రామ సమీపంలో కారుమంచి గ్రామానికి చెందిన మల్లవరపు నాగేశ్వరరావు మద్యం ఫుటుగా సేవించి చిన్నకొత్తపల్లిలోని అత్తగారింటికి వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో అద్దంకి 108 ఈఎంటి హరిబాబు ప్రథమ చికిత్స అందించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కొండమంజులూరు పాఠశాలకు బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి- పంగులూరు

మండలంలోని కొండ మంజులూరు గ్రామంలోని జెడ్పి ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అత్యుత్తమ రవాణా సౌకర్యం కల్పించే నిమిత్తం ఆ గ్రామ విద్యాదాత, కొండమంజులూరు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బొప్పూడి నాగేశ్వరరావు ఒక బస్సును ఏర్పాటు చేశారు. ఈ బస్సును తెలుగుదేశం సీనియర్ నాయకులు, గ్రామ పెద్ద చింతల సహదేవుడు రిబ్బన్ కట్ చేసి సోమవారం ప్రారంభించారు. బొప్పూడి నాగేశ్వరరావు ఆయన తల్లి బొప్పూడి వనజాక్షమ్మ జ్ఞాపకార్థం రూ.10లక్షలకుపైగా వెచ్చించి బస్సును ఏర్పాటు చేశారు. మండలంలోని బైటమంజులూరు, భగవాన్ రాజుపాలెం, కోటపాడు గ్రామాల నుండి కొండమంజులూరు పాఠశాలకు వచ్చే



ప్రభుత్వ పాఠశాలకు ఏర్పాటు చేసిన బస్సు

150 మంది విద్యార్థులకు ఈ బస్సు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు బొప్పూడి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల హెచ్ఎం ఇమ్మడిశెట్టి అనిత మాట్లాడుతూ బస్సు సౌకర్యం ద్వారా బాల, బాలికలకు రవాణా సౌకర్యం కలిగిందని, పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరగటానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో బొప్పూడి నాగేశ్వరరావు తండ్రి సంజీవరావు, విద్యా కమిటీ చైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ చైర్మన్ రావుల నరసింహారావు, పరిసర గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగల సంఘ అధ్యక్షునిగా రావుల బాపయ్య

ప్రజాశక్తి - అద్దంకి

విజయవాడ రెవిన్యూ భవనంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అద్దంకి, మార్టూరు, ఇంకొల్లు మండలం నుండి బాపట్ల జిల్లా శాఖ2 అధ్యక్షులుగా రావుల బాపయ్య, కార్యదర్శి కరి కమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులకు అద్దంకి అధ్యక్ష, కార్యదర్శి షేక్ మస్తాన్, తేళ్ళ కృష్ణయ్య, మార్టూరు అధ్యక్ష, కార్యదర్శి షేక్ కమాలుద్దీన్, పి చిట్టిబాబు, హరినాల ప్రసాదరావు, ఇంకొల్లు అధ్యక్షులు యర్రగుండ కృష్ణమూర్తి, తూమాటి ఆంజనేయులు, పొనుగుపాటి వెంకట సుబ్బారావు, ఆవుల హనుమంతరావు, ఉప్పాల వెంకట గోపాలరావు తదితరులు అభినందనలు తెలిపారు.



రావుల బాపయ్య



కరి కమలేశ్వరరావు



శ్రీరామచంద్రమూర్తి

బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - బాపట్ల

చిన్నారులతో దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు బాణాసంచా కాల్చే సమయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వరరావు సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు, కళ్ళజోడు ధరించాలని చెప్పారు. ముఖం ప్రక్కకు తి ప్పి బాణాసంచా కాల్చాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని చెప్పారు. నిప్పంటించాక పేలని బాణాసంచాను దగ్గరగా వెళ్లి ముట్టుకోకుండా వాటిపై నీటిని చల్లాలని చెప్పారు. గాజు సీసాల్లో, లోహపు డబ్బాల్లో బాణసంచా ఉంచి కాల్చకూడదని అన్నారు. మంటలు వేగంగా వ్యాపించే పెట్రోల్ బంకులు, వరిగడ్డి వాములు, పూరి గుడిసెలు వంటి వాటికి దూరంగా బాణసంచా కాల్చాలని సూచించారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడే వారికి, చిన్న పిల్లలు ఉన్న చోట ఎక్కువ శబ్దం వచ్చే టపాసులను



వెంకటేశ్వరరావు

కాల్చకూడదని చెప్పారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వాటిని ఎదుర్కోనేందుకు బక్కెట్లలో నీటిని, ప్రథమ చికిత్స సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. శబ్ద, వాయు కాలుష్యం కలుగకుండా పర్యావరణ హితమైన బాణసంచా కాల్చాలని అన్నారు. ఆసుత్రులు, పాఠశాలలు, కార్యాలయాలకు దూరంగా బాణాసంచా కాల్చాలని తెలిపారు. పిల్లలు పెద్దల సమక్షంలో మాత్రమే బాణసంచా కాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. శ్వాసకోశ సంబంధిత రోగులు బాణాసంచా కాల్చే పొగకు దూరంగా ఉండాలని అన్నారు. అగ్గిపుల్లలు వాడకుండా కొవ్వొత్తులు, అగరబత్తిలు సహాయంతో బాణసంచా కాల్చాలని సూచించారు. గుర్తింపు పొందిన బాణాసంచా షాపుల్లోనే బాణాసంచా కొనుగోలు చెయ్యాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే 101, అగ్నిమాపక కార్యాలయం 08643 – 224311 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు.

కూటమి పాలనలో రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందని తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబు అన్నారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే అభివృద్ధి పథంలో రాష్ట్రం పరుగులు పెడుతుందని అన్నారు. సకాలంలో పెన్షన్లు, జీతాలు అందిస్తూ ప్రజలందరి మన్ననలు పొందుతుందని అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిలో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేస్తే ప్రస్తుతం అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని తెలిపారు. నాలుగు నెలల్లో 175 నియోజకవర్గాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారని అన్నారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తూ భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించే విధంగా చర్యలు చేపట్టారని అన్నారు. రాజధాని అమరావతిని వేగంగా అభివృద్ధి చేస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు



మాట్లాడుతున్న సలగల రాజశేఖర్‌బాబు

చేపట్టారని అన్నారు. రానున్న రోజుల్లో దీపం పథకం అమలు చేసి సూపర్ సిక్స్ పథకాల అమలకు చర్యలు చేపట్టారని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎంఎల్‌సి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని కోరారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తూ సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం నాయకులు తానికొండ దయాబాబు, బడుగు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ జి రఘునాథరెడ్డి

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్‌టిఆర్ భద్రత పింఛన్లు నవంబర్ 1న తెల్లవారు జాము నుండే లబ్దిదారులకు అందజేయాలని కమిషనర్ జి రఘునాథరెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకొవడంలో వెనుకాడేది లేదన్నారు. సచివాలయాల వారీగా నియమించిన నోడల్ అధికారులు అందరూ పింఛన్ల పంపిణీ తీరును ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. పింఛన్ల పంపిణీ వేగవంతం అయ్యేలా చూడాలని సూచించారు. మునిసిపల్ డిఈ కృష్ణారెడ్డి, టిపిఒ మల్లికార్జునరావు, మేనేజర్ పి లక్ష్మయ్య, ఆర్ఓ షేక్ జబ్బార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి టి లీలావతి

ఉచిత న్యాయం పొందొచ్చు

ప్రజాశక్తి - రేపల్లె

సబ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో ఆర్థికంగా కేసు న్యాయవాదితో వాదించుకోలేని వారికి న్యాయస్థానం ద్వారా ఉచిత న్యాయం పొందే అవకాశం ఉందని గుంటూరు సీనియర్ సివిల్ జడ్జ్ టి లీలావతి సూచించారు. స్థానిక సబ్ జైల్లో ఖైదీలకు ఉచిత న్యాయ అవగాహన సోమవారం కల్పించారు. సబ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న 24మంది ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా స్తోమత లేని ఖైదీలు ఎవరైనా ఉంటే సబ్ జైల్ అధికారి ద్వారా స్థానిక న్యాయస్థానానికి అర్జీ పెట్టుకుంటే సదరు జడ్జి పూర్వాపరాలు పరిశీలించి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని తెలిపారు. సబ్ జైల్లో వసతుల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల మారిన చట్టాలకు అనుగుణంగా సబ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కొంత వెసులు బాటు కల్పిస్తూ చట్టాలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ జి కుమార్ బాబు, పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, సయ్యద్ తాహిర్ అహ్మద్, సబ్ జైల్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులచే డాక్టర్ ఆకెళ్ళ విభీషణశర్మ రచించిన 'మానవులందరికి భగవద్గీత' అనే పుస్తకావిష్కరణ టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆద్వర్యంలో స్థానిక ప్రియదర్శిని ఫర్నిచర్ దుకాణం వద్ద సోమవారం నిర్వహించారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలు క్రోడీకరించి సామాన్యులు, విద్యార్థులకు భగవద్గీత సారాంశం అందించడమే ఉద్దేశ్యంగా సరళంగా రచించినట్లు చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. పుస్తకావిష్కరణలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్‌జెడి డాక్టర్ యు దేవపాలన, ప్రముఖ కవి చెన్నుపాటి రామాంజనేయులు, సాహితి విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు, సృజన అధ్యక్షులు దివాకరదత్తు, వారనాసి రఘురామశర్మ, తాళ్ళూరి బాబూరావు, రిటైర్డ్ టీచర్ అడుసుమల్లి అనంతు కోటేశ్వరరావు, మాదాల దానయ్య, పుట్టా వీరాంజ నేయయులు, పెద్దిసెట్టి వెంకటాద్రి, రామిసెట్టి రవి, జాస్తి వెంకటేశ్వర్లు, మారం కోటేశ్వరరావు పాల్గొన్నారు. వివరములకు 9848418538 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

డ్వాక్రా యానిమేటర్‌పై విచారణ ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల సమైక్య పరిధిలోని భట్టిప్రోలు గ్రామైక్య సంఘ యానిమేటర్‌గా పనిచేస్తున్న కౌతరపు అనూష చేతివాటంపై సంబంధిత అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామైక్య సంఘం పరిధిలో కొందరు గ్రూపు సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి అవినీతికి పాల్పడిన అనూష అక్రమాలు ఈ విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనాన్ని సుమోటోగా తీసుకున్న పిడి దీనిపై విచారణ చేయాలని రేపల్లె ఏరియా కో ఆర్డినేటర్ పి రమాదేవిని విచారణ అధికారిగా నియమించారు. ఈ గ్రామైఖ్య సంఘం పరిధిలోని డ్వాక్రా గ్రూపు సభ్యులను వారికి సంబంధించిన రికార్డులతో కార్యాలయానికి పిలిపించారు. రికార్డులతో పాటు బ్యాంకు లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలించారు. వీటిలో కొందరి పేరున గ్రూపు సభ్యులకు సంబంధం లేకుండానే శ్రీనిధి రుణాలు తీసుకున్నట్లు వెలుగు చూసింది. గ్రామంలో కొన్ని గ్రూపులకు సంబంధించి ఒక గ్రూపు పేరున రూ.4లక్షలు, మరొకరికి రూ.1.50లక్షలు, మరో గ్రూపుకు రూ.5లక్షలు డ్రా చేసినట్లు తెలిసింది. ముక్తి డ్వాక్రా గ్రూపు పేరున సభ్యులకు తెలియకుండానే రూ.2లక్షలు చొప్పున గ్రూపు సభ్యుల పేరున యానిమేటర్ డ్రా చేసుకొని సొంతానికి వినియోగించుకున్నట్లుగా పరిశీలనలో తేలింది. గ్రామహిత సంఘంలోని డబ్బును గ్రూపు సభ్యుల్లో ఎవరికైనా అత్యవసర పరిస్థితి ఎదురై రుణం పొందాలంటే దానికి ముందుగా రుణం అవసరమైన వారి పేర్లను గ్రూపు సభ్యులు తీర్మానం చేసి దానిని గ్రామైక్య సంఘానికి అందించాలి. గ్రామైక సంఘంలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు యానిమేటర్ వీటిని పరిశీలించి గ్రామైక్య సంఘంలోని నిధులను బట్టి అత్యవసర పరిస్థితి ఉన్నవారికి రుణం మంజూరు చేయాలని కోరుతూ మండల సమైక్యకు పంపించాల్సి ఉంది. దానిని పరిశీలించిన మండల సమైక్య రుణాన్ని మంజూరు చేస్తూ చెక్కులను తయారు చేసి గ్రామైక్య సంఘానికి పంపిస్తారు. ఈ చెక్కులను యానిమేటర్ రుణం కోరిన సభ్యుల పేరున వారి ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ విధానం మొత్తం సజావుగానే కొన్ని గ్రూపులకు జరిగింది. మండల సమైక్య నుండి సభ్యుల పేరున మంజూరైన రుణ చెక్కులు గ్రామైక్య సంఘం వరకు చేరాయి. కానీ అక్కడి నుండి ఈ చెక్కులు సంబంధిత సభ్యుల పేరున జమ కాకపోవడం విశేషం. ఎవరి అకౌంట్లో జమ అయ్యాయో తేలాల్సి ఉంది. ఇదే పరిస్థితి ముక్తి డ్వాక్రా గ్రూపు సభ్యులకు సంబంధం లేకుండా వారి పేరున రూ.2లక్షలు ఫోర్జరీ సంతకాలతో తీసుకున్నట్లు వెలుగు చూడటంతో విచారణ అధికారి వారి రికార్డులు, సోము డ్రా చేసిన సంతకాలను పరిశీలన జరిపారు. ఈ రెండింటిలో సంతకాలు కలవలేదని నిర్ధారణ అయింది. ఈ రూ.2లక్షల రుణానికి ఆ గ్రూపుకు ఎలాంటి సంబంధం లేదని ఆ గ్రూపు సభ్యులు వాపోయారు. వీటితోపాటు కొందరు సభ్యులకు గృహ నిర్మాణ కొరకు మంజూరు చేసిన రూ.35వేలను కూడా యానిమేటర్ లబ్ధిదారుల ఎకౌంటుకు జమ చేయకుండా తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నట్లు పరిశీలనలో వ్యక్తమౌతుంది.



మండల సమైక్య వద్ద గుమికూడిన డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

గ్రామైక్య సంఘాలన్నీ ఇదే తీరు

మండల సమైక్య కేంద్రం పరిధిలో భట్టిప్రోలు గ్రామైక్య సంఘం ఒక్కటే కాదు. మండలంలో 40గ్రామైఖ్య సంఘాలు ఉన్నాయి. వీటిలో సంఘాల్లో పరిశీలన జరిపితే ఇలాంటి అవినీతి, అక్రమాలు అనేకం వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే కోవలోనే వెల్లటూరులో రెండు గ్రామైక్య సంఘాలు, భట్టిప్రోలు కొన్ని సంఘాలు, ఐలవరం, పల్లికోన వంటి గ్రామాల్లోని సంఘాల్లో ఇదే రీతిలో అవినీతి అక్రమాలు ఉన్నట్లుగా సభ్యులు ఆరోపిస్తున్నారు. మండలం మొత్తం పూర్తిస్థాయిలో విచారణ జరిపితే రూ.కోట్లలో అవినీతి వెలుగు చూసే పరిస్థితులు ఉన్నాయని, ఆ మేరకు ఉన్నతాధికారులు చొరవచూపి విచారణ చేపట్టాలని కోరుతున్నారు. గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసే స్త్రీ నిధి సొమ్ము అనేక రూపాల్లో అవినీతి, అక్రమాలతో దుర్వినియోగం అవుతుందని, దీనికి యానిమేటర్లే బాధ్యులు కాకుండా మండల సమైక్యలో పనిచేసే సంబంధిత అధికారుల పాత్ర కూడా ఉందని సభ్యులు బహిరంగంగా ఆరోపించడం విశేషం. వీటిపై డ్వామా జిల్లా అధికారులు ఏమేరకు విచారణ చేయబడతారో వేచి చూడాల్సి ఉంది.

రెండు రోజుల్లో వివరాలు వెల్లడిస్తాం

ఈ విషయంపై ఏరియా కోఆర్డినేటర్ పి రమాదేవి మాట్లాడుతూ విచారణ రెండు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. విచారణ పూర్తయ్యాక విచారణలో తేలిన సమాచారాన్ని వివరిస్తామని తెలిపారు.



విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థినులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో జంతు శాస్త్ర విభాగం, రైట్ హాస్పిటల్ సంయుక్తంగా విద్యార్థినులకు ఉచిత వైద్య శిభిరం సోమవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ మురళి, రైట్ హాస్పిటల్ డాక్టర్ దీవెన, జంతు శాస్త్ర విభాగ ప్రతినిధి డాక్టర్ ఎన్ అంకమ్మ పర్యవేక్షణలో విద్యార్థునులకు రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో చెస్‌పోటీలు

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ వారోత్సవాల సందర్భంగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా యువజన వారోత్సవాలు 2వ రోజు విద్యార్థులకు దేశభక్తి గీతాలు, స్ఫూర్తి గీతాల పాటల పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రూపాదేవి, గురువర్థిని వ్యవహరించారు. చందలూరి బాల వెంకటేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ ఐ బాబూరావు, టి లక్ష్మీప్రతాప్, జివై ప్రసాద్, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ భాను కుమారి,సెక్రటరీ తల్లం రమా, ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఎడిటర్ సుభాషిణి పాల్గొన్నారు.

30న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - రేపల్లె

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 30న కౌన్సిల్ హాలులో జరుగుతుందని కమిషనర్ సాంబ శివరావు తెలిపారు. సమావేశానికి చైర్పర్సన్ కట్టా మంగ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్స్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నగరం

నాటు సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ సిఐ శ్రీరామ్ ప్రసాద్ మెరుపు దాడులు చేశారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన సారాయి కేంద్రాలపై చర్యలు తీసుకుంటున్నారు. జంపనివారిపాలెం పరిసర ప్రాంతాల్లో కాపు సారాయి కాస్తున్నారనే సమాచారం అందటంతో దాడులు చేశారు. 700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎవరైనా కాపు సారాయి తయారు చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో కె వెంకటరమణ, పి శ్రీనివాసరెడ్డి, కె శ్రీనివాసరెడ్డి, డ్రైవర్ పి భాస్కర్ పాల్గొన్నారు.



నాటు సారా తయారీ ఊట ధ్వంసం చేస్తున్న అధికారులు

మాదిగల ఆత్మీయ సదస్సు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మాదిగ జాతి ఆత్మగౌరవ శిఖరం మాన్యశ్రీ మందా కృష్ణ మాదిగ ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా మాదిగల ఆత్మీయ సదస్సు నవంబర్ 3న ఒంగోలు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బుడంగుట్ల లక్ష్మినరసయ్య తెలిపారు. స్థానిక స్టాలిన్‌పేట ఎబిఎన్ చర్చి నందు ఎంఆర్పిఎస్, ఎంఎస్పి సమావేశం సోమవారం నిర్వహించారు. 30ఏళ్ల పోరాట ఫలితంగా భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నందు ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన సందర్భంగా మందా కృష్ణ మాదిగ మొట్ట మొదటిసారిగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జిల్లా అయిన ఒంగోలు పట్టంనకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లెపోగు నాని, గానుగుపాటి సురేంద్ర, ఎంఈఎఫ్ ఇంకొల్లు నాయకుడు వల్లేరు భాను, వలేరు కోటేశ్వరరావు, పల్లపాటి డేవిడ్సన్, పల్లెపొగు స్టీఫెన్, పల్లపాటి భాస్కర్, ఏజర్ల ఏసోబు, పల్లెపోగు జాన్సన్, సుధీర్, రవీంద్ర, పల్లపాటి భాగ్యరావు, నాగార్జున, సాల్మన్ పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న టర్బో లారీని మైనింగ్ అధికారులు సోమవారం గుర్తించారు. లారీ డ్రైవర్ వద్ద ఏలాంటి పత్రాలు చూపకపోవడంతో ఇసుక లారీని స్వాదీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మైనింగ్ అధికారులు లారీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్లపై పందులు సంచరిస్తే యజమానులపై చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

రోడ్ల మీద, ఇళ్ల మధ్యలో వదలు సంచరిస్తే వాటి యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కమిషనర్ కాకర్ల సాంబశివరావు పర్కొన్నారు. ఇళ్లమధ్యలో కాకుండా దూరంగా పందులను ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో పట్టణంలోని పందుల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు మాట్లాడుతూ పందుల పెంపకానికి ఎస్టీ కార్పొరేషన్ నుండి రుణాలు వచ్చే విధంగా ప్రత్యమ్నాయ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కట్టా మంగ సుబ్బారావు, పందుల యజమానులు పాల్గొన్నారు.

పంట కోతపై శిక్షణ

ప్రజాశక్తి - కొల్లూరు

పంట కోతపై స్థానిక ఎంపిడిఒ మీటింగ్ హాలులో విఎఎలు, విహెచ్‌ఎలు, విఎస్ఎలు, ఎఇఒలు, ఎఒలకు సోమవారం శిక్షణ నిర్వహించారు. రేపల్లె ఎడిఎ విజయ్ బాబు, బాపట్ల డిఆర్సి ఎడిఎ హుస్సేన్, డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ బాల మురళీధర్ నాయక్ పంట కోత ప్రయోగం, పాడి పంటలు, మ్యాగ్జెన్లపై క్లుప్తంగా వివరించారు. గ్రామస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఎఒ ఆర్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి పి ప్రశాంతి

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పర్చూరు

జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 14న స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి పి ప్రశాంతి తెలిపారు. కోర్టులో పోలీసు అధికారులతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే కలిగే ప్రయోజనాలు అర్జీదారులు, కక్షిదారులకు వివరించాలని అన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పే అంతిమ తీర్పని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి, కారంచేడు ఎస్ఐలు మాల్యాద్రి, రత్నకుమారి, మధుబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

జాగ్రత్తలు పాటిస్తే డయేరియా బారిన పడకుండా ఉండొచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాంతి ప్రియ అన్నారు. మండలంలోని కారంచేడులో డయేరియా వ్యాధిపై అవగాహన ర్యాలి సోమవారం నిర్వహించారు. స్థానిక ప్రజలతో సమావేశమైన డాక్టర్ శాంతి ప్రియ మాట్లాడుతూ నిత్యం చేతులు శుభ్రపర్చుకోవాల్సిన ఆవశ్యకత వివరించారు. ఆహారం వండేటప్పుడు, తినేటప్పుడు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. దీనివలన వ్యాధుల బారిన పడకుండా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీ తిరుపతమ్మ, మేరీ, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీపై అవగాహన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి 10మంది అధికారులను పర్యవేక్షకులుగా నియమించినట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. వీరందరికీ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అవగాహన కల్పించినట్లు తెలిపారు. మండలంలో 9927మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.4.23కోట్లు పంపిణీ చేసేందుకు 175మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి పర్యవేక్షణకు 10మంది అధికారులను నియమించినట్లు తెలిపారు.

బీచ్ రిసార్ట్సలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వేటపాలెం

రిసార్ట్సలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని సముద్ర తీరంలో ఉన్న రిసార్ట్స లను ఆయన సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రివేరా, ఆలా, సీగల్ రిసార్ట్స రూముల బుకింగ్ కౌంటర్ నందు రికార్డులను పరిశీలించారు.

వందరోజుల పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

ఉపాధి హామీ కూలీలకు 100 రోజులు పని దినాలు కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలని పలువురు డిమాండ్ చేశారు. మండలంలోని అక్కయ్యపాలెం పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభ సోమవారం నిర్వహించారు. గ్రామంలో 49పనులను గుర్తించినట్లు తెలిపారు. పంచాయతీ ప్రత్యేక అధికారి ఐ కాశి విశ్వనాథ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించి పనులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ షేక్ గౌస్ మహమ్మదీమ్ అలీ, ఎన్ఆర్ఇజిఎస్ ఈసి దేవబాబు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మనం దానం చేసే రక్తం మరొకరికి పునర్జన్మనిస్తుందని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం బాపట్ల జిల్లా ఏఆర్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజల కోసం పోలీస్ అధికారులు వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. దీంతో పాటు రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయగా వీటిని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ ప్రారంభించారు. వైద్యశిబిరంలో చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ హక్, దంత వైద్య నిపుణులు అబ్రహం బ్లేస్సి, జనరల్ మెడిసిన్ లో నిపుణులు జాన్ పాల్, హృద్రోగ చికిత్స నిపుణులు శ్రీకాంత్, కంటి వైద్య నిపుణులు వెంకట్, ఇ.ఎన్.టి నిపుణులు ఫిరోజ్ అన్వర్ తదితరులు వారి సిబ్బంది పాల్గొన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పోలీసులు, పోలీస్ కుటుంబ సభ్యులు, ప్రజలు మొత్తం సుమారు 103 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల బ్లడ్ సెంటర్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాపట్ల వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు, పోలీసులు కలిపి మొత్తం సుమారు 50 మంది రక్తదానం చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాలలో సుమారు 270 మంది రక్తదానం చేశారు. అడిషనల్ ఎస్పీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందిని ప్రజలు అభినందించారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై

ప్రత్యేక దృష్టి సారించాలి..: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను వినతిపత్రాల ద్వారా విన్నవించారు. పీజీఆర్ఎస్ లో 148 అర్జీలు నమోదయ్యాయి. పీజీఆర్ఎస్‌పై అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిక్షిప్తం చేయాలన్నారు. మంత్రులు, శాసనసభ్యులకు వచ్చిన అర్జీలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలోని ఎస్టీలం దరికీ ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 31వ తేదీన దీపావళి పండుగ నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి అవసరతను బట్టి ముందస్తుగానే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలన్నారు. ఒకటో తేదీన ఉదయం ఐదున్నర గంటలకి లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది పింఛన్ నగదు పంపిణీ చేయాలన్నారు. అక్రమాలు జరగకుండా మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు బాధ్యత వహించాలన్నారు. యువతలో నైపుణ్యాల గణన సర్వే ప్రక్రియ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున సచివాలయాల సిబ్బందిని ఎంపిక చేసి పంపాలన్నారు. సర్వే చేసే సచివాలయాల సిబ్బందికి ఈ నెల 30వ తేదీన శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సూర్యలంక బీచ్ వద్ద సోమవారాలలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్తీక మాసంలో పూజలు, తదుపరి స్నానాలు ఆచరించడానికి ప్రజలు అత్యధికంగా వచ్చే అవకాశం ఉన్నందున వైద్యశిబిరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆహార పదార్థాలకు ఎలాంటి నష్టం లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర చర్యలు

ఎస్పీ ఏఆర్ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసంకు 71 ఫిర్యాదులు అందాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు, స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి సమస్యలను ధైర్యంగా ఎస్‌పికి విన్నవించుకున్నారు. ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్‌పి స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వచ్చిన ఆయా ఫిర్యాదులపై జిల్లా ఎస్‌పి సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, జాబ్ మోసాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ప్రజలు వినతులు ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో దిశా ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డిటిసి ఇన్‌స్పెక్టర్ సమీముల్లా, ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు రజియా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

మా కడుపు కొట్టొద్దు..

- విధుల్లోకి తీసుకోవాలని
- కమిషనర్ ఛాంబర్‌లో కార్మికుల బైఠాయింపు
- రంగప్రవేశం చేసిన పోలీసులు



కమిషనర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో గందరగోళం నెలకొంది. అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని గత 14 రోజులుగా ఆందోళన కొనసాగుతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో మున్సిపల్ ఛాంబర్‌ను సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ నుండి సరైన సమాధానం రాకపోవడంతో సిఐటియు నాయకులతో పాటు కార్మికులు కమిషనర్ ఛాంబర్‌లో బైఠాయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. 'మా కడుపు కొట్టొద్దు సార్' అంటూ పోలీసులను కూడా కార్మికులు వేడుకున్నారు.

మార్కాపురం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న 21 మంది కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విధులకు రావద్దని కమిషనర్ డివిఎస్ నారాయణ హుకుం జారీ చేశారు. ఎందుకు తొలగించారని కోరగా అందుకు సమాధానం లేదు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. అధికారపార్టీ ఒత్తిడితో అక్రమ తొలగింపులు జరుగుతున్నాయని చర్చ జరుగుతోంది. సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీతో పాటు డి.సోమయ్య, కార్మిక యూనియన్ నాయకులు కె.సుబ్బారాయుడుతో పాటు పలువురు కార్మికులు కమిషనర్ డివిఎస్ నారాయణతో చర్చలు జరిపారు. కారణాలు చెప్పకపోవడంతో మాటామాటా పెరిగింది. దీంతో కార్మికులు బైఠాయించక తప్పలేదు. సుమారు రెండున్నర గంటల పాటు ఈ బైఠాయింపు కొనసాగింది. నినాదాలతో ఆందోళన కొనసాగింది. కమిషనర్ డివిఎస్ నారాయణ పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబుకు సమాచారం అందించారు. ఎస్ఐ సైదుబాబుతో పలువురు పోలీసులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆందోళన విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కొంత పెనుగులాట జరిగింది. కార్మికులు మాత్రం 'మా కడుపు కొట్టొద్దు సార్..' అంటే కాళ్లపై పడ్డారు. ఎప్పటి నుంచో ఇదే పని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, తామంతా ఆప్కాస్‌లో ఉన్నామని, అక్రమంగా తమను తొలగించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ప్రాధేయపడ్డారు. ఈ తొలగింపులు అక్రమమో... సక్రమమో... ఒకటి రెండు రోజుల్లో జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించేంత వరకు వేచి ఉండాలని, అప్పటివరకు ఆందోళన చేయవద్దని కమిషనర్ నారాయణ సమాధానం ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



గ్రోమోర్‌లో పరిశీలిస్తున్న ఏవో

'గ్రోమోర్'లో ఏవో పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన


ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు గ్రోమోర్ సెంటర్‌ను వ్యవసాయాధికారి పి.వెంకట్రావు సోమవారం పరిశీలించారు. 'ప్రజాశక్తి'లో సోమవారం 'గ్రోమోర్ మాయాజాలం' పేరుతో వచ్చిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. సోమవారం వ్యవసాయాధికారి పి.వెంకట్రావు ఉప్పుగుండూరులో ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మరాదని చెప్పారు. డిఎపి ఎరువులకి పురుగుమందులు లేదా మైక్రో న్యూట్రిషియన్స్ లింకు పెట్టి అమ్మరాదని ఆదేశించారు. ఎరువులు అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి..

కలెక్టర్ వెంకట మురళి



నియామక పత్రం అందజేస్తున్న వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ నియామక పత్రాలను సోమవారం అందించారు. కేజీబీవీ చీరాలలో సి ఆర్ టి ఫిజిక్స్ టీచర్‌గా ఎంపికైన తాళ్లూరి సౌజన్య, కేజీబీవీ బల్లికురవలో అకౌంటెంట్ గా ఎంపికైన నల్లగుండ్ల స్వాతి, చీరాల ఏపీ మోడల్ స్కూల్‌లో పార్ట్ టైమ్ టీచర్‌గా ఎంపికైన రవి భవానీకి కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారిని కలెక్టర్ అభినందించి పత్రాలను అందించారు. రేపల్లె మండలానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు ఒక కేసు విషయమై పోలీస్ స్టేషన్‌లోని లాకప్‌లో ఉండగానే అక్కడే 2015లో మతి చెందారు. ఈ విషయంపై మతుడి తల్లిదండ్రులు యార్లగడ్డ సాంబశివరావు, వెంకటేశ్వరమ్మలు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఢిల్లీలోని ఎన్ హెచ్ ఆర్ సి బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు రూ.5 లక్షల నగదును మతుని తల్లిదండ్రులకు చెక్కు రూపంలో కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి గ్లోరియా, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

'మీకోసం'లో 242 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 242 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పిటిషన్లు రీఓపెన్ కాకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమని, మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డులలో చూపితే సహించబోనన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని, పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను అర్జీదారులకు వివరించాలని ఆమె స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలలో భాగంగా అవినీతికి వ్యతిరేకంగా, బాధ్యతగల పౌరునిగా ప్రవర్తిస్తామంటూ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, డిఆర్ఓ బి.చినఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ సూరిబాబు